విచ్చిన మబ్బులు

విశ్వనాథం కాలుతున్న ఇంట్లోకి వెళ్ళి మంటల్లోనుండి శాంతను రెండు చేతులా పట్టి లాక్కొచ్చి మంచమ్మీద పడుకోబెట్టాడు.

"శాంతా! ఏమిటీ అఘాయిత్యం! ఎందుకు వెళ్ళావు మండుతున్న ఇంట్లోకి?"

శాంతకు అప్పటికే కట్టుకున్న చీరె చాలావరకు కాలింది. తల వెంట్రుకలు కూడా అంటుకున్నాయి. చేతులూ, ముఖమూ కమిలి నలుపుకు తిరిగాయి.

"మన ప్రాణాలు దక్కితేచాలు. ముఖ్యమైన సామాన్లు వెంకన్న తెచ్చి బయట పడేస్తున్నాడు. నీవెందుకు వెళ్ళావు చెప్పు యింట్లోకి? అయినా ఈ స్థితిలో నీవు వెళ్ళవచ్చా? ఏమిటీ గూళ్ళన్నీ అలా వెదుకుతున్నావు?"

శాంత నుదురు కొబ్బరి నూనెలో తడిపిన దూదితో అద్దుతూ దగ్గరగా మంచమ్మీద కూర్చున్నాడు విశ్వనాథం.

శాంత భయంతో గజగజ వణకిపోతున్నది. కన్నీటి తడికి తల వెంట్రుకలు చెంపలకు అతుక్కున్నాయి. కళ్ళు మూసుకుని మూలుగుతున్నది.

చటుక్కున విశ్వనాథానికి ఏదో జ్ఞాపకానికి వచ్చింది. వెంకన్నా అంటూ పరుగెత్తాడు. అప్పటికి వెంకన్న చేతికందిన సామానంతా చేరవేశాడు. దణ్ణెంమీద బట్టలన్నీ లుంగచుట్టి పరుపుచుట్టలమీద పడేశాడు. విశ్వనాథం తన లా పుస్తకాలు, ఆఫీసు కాగితాలు వచ్చినవి లెక్క చూసుకుని పెట్టెలన్నీ ఒకదానిమీద ఒకటి పేర్చాడు.

సంధ్య చీకట్లలో విశ్వనాథం రాజవీధిలో క్రొత్తగా కట్టిస్తున్న ఇంటిని చూసి వస్తున్నాడు. వీధిమలుపు తిరగకముందే "ఇల్లంటుకుంది బాబూ" అంటూ

కేకలు పెడుతూ వెంకన్న ఎదురుగా వచ్చాడు వెంకన్నతోపాటు ఉరుకుపరుగుల మీద ఇల్లు చేరుకుని ఆఫీసు గది తాళంతీసి చేతనయినన్ని లా పుస్తకాలు బయట వేయించాడు. ఇరుగుపొరుగుల సహాయంతో ఇంచుమించుగా సామానంతా బయటికి వచ్చింది.

వస్తువులు కంటికి సరిగా కనబడకుండా పొగ చుట్టేసింది ఒక్కొక్క దిశనుంచి మంటలు నాలుకలు చాపుతూ పైకెగసి ఆకాశాన్నంటుతున్నాయి. మంటల విజృంభణకు జనం వెనక్కు తగ్గారు

"అయ్యో! బాబూ! అమ్మగారేరీ!"

విశ్వనాథానికి మతిపోయినట్లయింది శాంత మంచమ్మీదలేదు విశ్వనాథం వెంకన్నను తోసుకుంటూ లోపలికి ఉరికాడు నాలుగుమూలలా అలుముకుపోయిన పొగలో కంటికేమీ కనబడటం లేదు పొగ గొంతులోకి పోయి దగ్గు వస్తున్నది. శాంతకోసం చేతులతో తడుముకుంటూ ముందుకు వెళ్ళాడు

శాంతగదిలో గూళ్ళన్నీ చేత్తో తడిమి చూస్తున్నది చేతికందినవన్నీ క్రింద పారేసి దేనికోసమో వెదుకుతున్నది ఆమె చీరె కుచ్చిళ్లు అతడి చేతి కందాయి. బయటికి లాక్కొచ్చాడు రెండు చేతులూ పట్టుకుని

రాత్రి పదకొండుగంటలకు మంటల విజృంభణ కొంతవరకూ తగ్గింది ఇంటి కలప చాలావరకూ కాలిపోయింది. వీధి వారంతాచేరి గాలికి ఆ నిప్పు మరో యింటిమీదికి ఎగరకుండా మళ్ళీనీళ్ళు పొయ్యటం మొదలు పెట్టారు

ఇంటి ముందున్న చెట్టు ఆకులన్నీ మంటల వేడికి మాడిపోయాయి. కాలి మోడులా ఉన్న చెట్టుక్రింద శూన్యమనస్కుడిలా నిలబడిపోయాడు విశ్వనాథం. అతడికి ఉండి ఉండి దుఃఖము ఉబుకుకుంటూ పైకి పొంగులా వస్తున్నది అతడి తాతగారు ముగ్గురు కూతుళ్ళు, నలుగురు కొడుకులతో సిరిసంపదలను అభివృద్ధి చేసుకుంటూ నలభయి సంవత్సరాలు ఆ యింట్లో సుఖసంతోషాలతో కాలం గడిపాడు. అతడి తండ్రి అచ్చివచ్చిన ఆ యింట్లో తన ఒక్క కొడుకును పెంచి పెద్దవాడిని చేసి మదరాసుపంపి లాయర్ని చేశాడు. ఇంటిచుట్టూ తోటవేశాడు. విశ్వనాథం ఆ ఊరిమీద అభిమానము ఆ యింటిమీద మమతను చంపుకోలేక అక్కడే ప్రాక్టీసు పెట్టాడు ఇల్లు కొంతభాగం పడగొట్టి ఆధునిక పద్ధతులతో కట్టించి

కొత్త ఫర్నిచరుతో నూతనాలంకారములు చేశాడు. ఇదంతా జరిగి ఎనిమిది సంవత్స రాలు కాలేదు.

విశ్వనాధం మనోవీధిలో తప్పటడుగులు వేస్తూ వేస్తూ ఉన్న అతడి పిల్లలు ముగ్గురు వచ్చీరాని మాటల మాధుర్యాన్ని చవి చూపిస్తూ చూపిస్తూ చెయ్యిజారి పోయిన దృశ్యాలు గోచరమయ్యాయి. అతడి గుండె దిగజారినట్లయింది. దీర్ఘంగా నిట్టూర్చాడు.

ఇంటిముందు పోగయిన జనం ఒక్కొక్కరే వెళ్ళి పోయారు. ఆవేదన నణచుకుంటూ విశ్వనాధం శాంత మంచంముందుకు కుర్చీ జరుపుకున్నాడు. శాంత బాధతో మూలుగుతున్నది. తెరచిన కళ్ళు వాటంతట అవే మూతలు పడుతున్నాయి. పలకరిస్తే ఒక దాని కొకటి సంబంధంలేని మాటలు మాట్లాడుతున్నది. వినన క్రతో మందంగా వీస్తూ ఆమెముఖంలోకి చూశాడు విశ్వనాధం. రెండవసారి ఇంట్లోకి వెళ్ళినప్పుడు నడుముభాగం కాలి బొబ్బలెక్కింది.

ఆ వరసలో నాలుగు యిళ్ళు కాలి పోయాయి. జననష్టంకాలేదు. కాని వస్తునష్టం చాలా అయింది. పొగంతా మేఘాలరూపంలో ఆకాశమంతటా అలు ముకు పోయింది. వీధి దీపాలయినాలేని ఆ రాత్రివేళ మసకమసకగా ఉన్న చంద్ర కాంతిలో ఆ యిళ్లల్లోనివాళ్ళు సామాన్లమీదే ఒక్కొక్కరే ఒరిగారు.

వెంకన్న డాక్టర్ని వెంటబెట్టుకుని వచ్చేసరికి చర్చిలో రెండుగంటలు కొట్టారు. డాక్టరు గాయాలను పరీక్షచేసి ఇంజక్షను ఇచ్చినందువల్ల శాంతకు నిద్ర పట్టింది. కాని ఉదయం లేచేవేళకు జ్వరం నూటమూడు దాటింది.

కాలిన యింట్లోనుంచి వెచ్చటిపొగలు ఇంకా వస్తున్నాయి. వాకిటి వైపు గ్రామాలనుంచి వచ్చే పార్టీలకొరకు కట్టించిన పెద్ద చావడివంటిది చెక్కు చెదర లేదు. వెంకన్న ఉదయమేలేచి ముఖ్యమైన సామాను దానిలోకి చేరవేశాడు. మెల్లగా శాంత మంచము లోపలికి పట్టారు ఇద్దరూ కలిసి.

"వెంకన్నా!" శాంత మెల్లగా పిలిచింది. "సామానంతా వచ్చిందా?"

"సామాను గదిలో బియ్యం మూటలూ అవీ ఉండిపోయాయండీ".

"నా గదిలో గూళ్ళన్నీ ఖాళీచేశావా?"

''వాటిలో ఉన్నవన్నీ నా పెట్టెలో పడేశానండీ'' శాంతకు అప్పుడప్పుడే మైకం కమ్మినట్టుగా ఉంటున్నది. వెంకన్న చేతులు నులుముకుంటూ మంచం దగ్గర నిలబడిపోయాడు

పదిగంటలు దాటినప్పటినుండీ శాంతకు పలవరింతలు ప్రారంభమయ్యాయి. డాక్టరు వచ్చి గాయాలను పరీక్షచేశాడు జ్వరం నూటనాలుగు సమీపించింది. మరొక ఇంజక్షన్ యిచ్చాడు.

''ఆ పచ్చడబ్బా కాలిపోకూడదు''

రెండుగజాల దూరంలో కాఫీ తాగుతున్న డాక్టరు, విశ్వనాథము త్రుళ్ళి పడ్డారు

''1953 నుంచి ప్రాణాధికంగా దాచుకుంటున్న నా ఉత్తరాలు కాలిపో గూడదు.''

''శాంతా ! ఏమిటీ నీవనేది ? మెలకువతోనే ఉన్నావా ?'' దగ్గరగా వచ్చి కదిలించి పలకరించాడు విశ్వనాథం

శాంత కళ్ళు తెరిచి విశ్వనాథం ముఖంలోకి సూటిగానే చూసింది

''నా ఉత్తరాలు ! నా పెట్టె ! వాటిని చూసుకుని కష్టాలన్నీ మరచి బ్రతుకు తున్నాను '' చేతుల్తో కళ్లు మూసుకుని ఏడవటం మొదలు పెట్టింది

డాక్టరు విశ్వనాథం ముఖంలోకి చూశాడు విశ్వనాథం తలవంచుకున్నాడు.

''జ్వరం నూటనాలుగు దాటుతున్నది జ్వరం తగ్గితేగాని పలవరింతలు తగ్గవు ఐస్‌నీళ్ళలో ముంచిన బట్ట నుదిటిమీద వెయ్యండి.''

డాక్టరు వెళ్ళిపోయిన తరువాత విశ్వనాథం శాంత మంచందగ్గరనే కుర్చీ వేసుకుని కూర్చున్నాడు ఆమె కళ్ళు మూసుకుని పడుకుంది కాని అప్పుడప్పుడు పలవరిస్తూనే ఉంది విశ్వనాథం ఆదుర్దా పడుతున్నాడు

''1953 లో క్వీన్‌మేరీస్ కాలేజీ హాస్టల్లో ఉండగా నీ ఉహాత్తరాలకోసం ప్రతిరోజూ సాయంత్రం కాగానే వరండాలోకి వచ్చి నిలబడి పోయేదాన్ని నిరీక్ష

జాలో పడ్డ బాధంతా నీ ఉత్తరం గ్రీష్మంలో శీతల వాయువులా సేదతీర్చేది. ప్రభూ! నీ ఉత్తరాలన్నీ భద్రం చేసుకుని ప్రతినిత్యం కళ్ళలో చూసుకుని తలుచుకుంటే నా హృదయం పురివిప్పిన మయూరిలా నాట్యం చేస్తుంది. నన్ను మర్చిపోయావా ప్రభూ!''

విశ్వనాథం దిగ్భ్రాంతుడయిపోయాడు. తన వివాహం 1955 లో జరిగింది. దేహము కంపించిపోయినది. ఐస్‌నీళ్ళలో బట్ట మరొకసారి తడిపి ఆమె నుదుటిమీద వేశాడు.

ఆనాడు శాంత బలవంతంమీద ఒకకప్పు పాలుతాగింది. రాత్రంతా మగతగా పడుకునే ఉన్నది. మధ్య మధ్య మూలుగుతున్నది.

ఉదయం విశ్వనాథం లేచి జ్వరం చూశాడు. నూరుకి మించలేదు. ముఖం పీక్కుపోయింది శాంతకు. కళ్ళు గుంటలు పడ్డాయి. మాట బావిలోంచి వచ్చినట్టుగా ఉన్నది. డాక్టర్ని చూసి లేచి కూర్చోబోయింది.

''నిన్నటికంటే తేలిగ్గా ఉందికదండీ'' శాంత నాడిచూస్తూ పలకరించాడు డాక్టరు.

అవునన్నట్లు తల ఆడించింది.

విశ్వనాథం చెప్పాడు రాత్రంతా పలవరించిందని.

''జ్వరతీవ్రతఅండీ. జ్వరం తగ్గగానే ఆ లక్షణాలన్నీ వాటంతట అవే తగ్గిపోతాయి. రేపటికింకా నయమయిపోతుంది. ఆ మంటలు చూస్తుంటే ఎవరికయినా గాభరా ఎత్తుతుంది. అందులో ఒళ్లు కాలిందాయెను.''

సా యం కా లా ని కి కూడా శాంతకు జ్వరం హెచ్చలేదు. బాగా నిద్రపోయింది.

మరునాడు ఉదయం కాఫీ తాగుతూ ''మన యిల్లు పూర్తిగా భస్మమయిపోయింది శాంతా!'' అన్నాడు విశ్వనాథం ఆమె ముఖంలోకి చూస్తూ.

ఆమె ముఖం దిగాలుపడిపోయింది.

''నీవు మండుతున్న ఇంట్లోకి ఎందుకు వెళ్ళావు ? ఒళ్లు పైపైన కాలిందె కనుక సరిపోయింది కాని లేకపోతే ఎంత ప్రమాదమయేదో '' అతడి దృష్టి ఆమె గర్భంమీద పడ్డది.

శాంత కళ్లు దించుకుని కాఫీగ్లాసు క్రింద పెట్టింది.

"నీవు మొన్న ఎలా కలవరించావో తెలుసా 1853లో ఉత్తరాలంటూ కలవరించావు చాలాసేపు."

శాంత గతుక్కుమన్నది పైకి కనబడనీయకుండా సర్దుకుని విషాదంగా నవ్వింది.

ఆమెలో జరిగిన సంచలనాన్ని వో కంటకనిపెడుతూ విశ్వనాధం ఆలోచనల వలయంలో చిక్కుకుపోయాడు. 1953 లో శాంత ఎక్కడుంది ?

ఆ రాత్రి విశ్వనాధం సామాన్లకి కాపలాకాసినట్టుగా మేలుకునే ఉన్నాడు. నిద్రపోతున్న శాంత ముఖంచూస్తూ భావతంగాలు ముసురుకోగా అచావడి చుట్టూ తిరుగుతున్నాడు.

శాంత హాస్టల్లో ఉండగా ఎవరో ప్రేమలేఖలు వ్రాసిఉండాలి. పావలా డబ్బులకు కాపలావాళ్ళు లొంగిపోతారు. హాస్టల్లో ఉంచే ఏం- ఒంటిస్తంభం మేడ మీద ఉంచేనేం-ఆడది ఆడదే మర్మంముందుపుట్టి ఆడది తరువాత పుట్టింది కలవరింతలు నిజాన్ని బయటపడేస్తూ ఉంటాయి. సముద్రం హోరుపెట్టినట్టుగా హృదయం హోరుపెడుతోంది. గాలివానకు వూగిపోయే వృక్షంలా ఉంది అతడి మనసు.

విశ్వనాధం తలుపూ ద్వారబంధమూలేని చావడిలో పదిహేనురోజులు ఉండిపోవలసి వచ్చింది అంతలో క్రొత్తయిల్లు తయారయింది ఒకగది పూర్తికాగానే గృహప్రవేశమయ్యారు క్రొత్త యింట్లో ప్రవేశించారు వెంటనే

శాంతలేచి మామూలుగా తిరుగుతున్నది. సామాన్లు ఒక్కొక్కటే తీసి సర్దించుకున్నది డ్రస్సింగ్‌టేబుల్ అద్దంతుడిచింది సొరుగులు సర్దుతూ ఉండగా లేతపసుపురంగు పచ్చడబ్బా బయటపడ్డది. ఆమెముఖం ఒక్కసారి ప్రకాశించి ప్రఫుల్లమయింది. ఈ డబ్బా! దీనికోసమే కాలుతున్న యింట్లోకి వెళ్ళి వెదికింది విశ్వానాధం చూడకుండా రెండుసార్లు వెళ్ళి గాలించింది. ఆ పెట్టె తన ప్రాణంలో

ప్రాణం. దాన్ని గుండెకానించుకుని కళ్లుమూసింది. ఆనందంతో మూతతెరచి చూసు కుంది. గులాబీరేకులు తొలగించి పూలద్దిన జేబురుమాలుపైకెత్తి చూసింది. ఉన్నాయి, తన ప్రాణ సమానమయినవీ అమృత సమానమయినవీ ఉన్నాయి. భద్రంగా పెట్టిన మడతలు పెట్టినట్లే ఉన్నాయి. ఆ పెట్టె ఒకసారి కళ్ళకద్దుకుని అటికిడికి వెనక్కు తిరిగి చూసింది విశ్వనాథం తల దువ్వుకుంటూ నిలబడి ఉన్నాడు.

పట్టుబడిన అపరాధిలా శాంత గతుక్కుమన్నది. తలదించుకుని ఆ రోజల్లా తప్పించుకు తిరిగింది.

కొత్త ఇంట్లోకి వచ్చి నెలరోజులన్నా గడవక ముందే విశ్వనాథాన్ని పెంచిన పెత్తల్లికి సుస్తీగా ఉందని టెలిగ్రాము వచ్చింది స్థలం మార్పు కోరు కుంటున్న విశ్వనాథానికి అదొకమంచి సాగుగా కనబడ్డది.

"ఎన్నాళ్ళు మీ ప్రయాణం ? ఉండమంటే ఉంటకుండా గృహప్రవేశానికి వచ్చిన మరునాడే అత్తయ్యగారు వెళ్ళిపోయారు. మీరు వెళ్ళి వెంటనే తీసుకు వచ్చేయండి' ఆదుర్దా పడుతూ అన్నది శాంత.

"నేను దగ్గర ఉండి మందుయిస్తుంటే అదే తగ్గి పోతుంది" ముభావంగా ముందడుగు వేశాడు. చీరె మార్చుకుని వాకిటి గడపదగ్గిర నిలబడ్డ శాంత స్టేష నుకు విశ్వనాథం రమ్మంటే వెళ్లాలనిచూపింది.

అతడు సూట్ కేస్ తీసుకుని బండీ ఎక్కాడు.

విశ్వనాథం పెత్తల్లి శాంతను గురించి గుచ్చిగుచ్చి ప్రశ్నించింది. సుస్తీ తగ్గిపోయి నాలుగోనాటికల్లా తిరితిరగటం మొదలు పెట్టింది. విశ్వనాథం బట్టల్లా సర్దుకున్నాడు.

"ఇంతదూరం వచ్చావు. వారమన్నా కాకముందే బయలుదేరుతున్నావు. శాంత ఉత్తరం చూశాక నాకు ఉండబుద్దికావటంలేదు. రేపు ఒక్కరోజూ ఉండు. నేనూ వస్తాను."

"నేను ఇంటికి వెళ్ళటంలేదు అమ్మా. మదరాసు వెళ్ళాల్సినపని ఉంది. మెయిలులో నన్ను వెళ్ళనీ."

"లేనిలేనిదాన్ని ఒక్కతెనూ ఇంట్లో వదలిపెట్టి ఊళ్ళు పట్టుకుతిరుగుతావా? నామాటవిని ఇప్పటికి నీ ప్రయాణం వాయిదా వేసుకో''

"లెదు లే''దంటూ విశ్వనాథం తల తిప్పాడు

ఏమయినా వద్దువద్దంటే పంతంకొద్దీ చేసితీరే విశ్వనాథం స్వభావం ఆమెకు గుర్తుకువచ్చి నవ్వుకుంది. "నీసంతమే పంతం. సమయాసమయాలు చూసుకోకుండా ఏమిటాతిరగటం ? ఈ విషయంలో కూడా నీకొకరు చెప్పాలా ?'' మందలించింది తులశమ్మ.

విశ్వనాథం శాంతను గురించి ఆలోచనలన్నీ మెదడులోనుంచి బయటికి నెట్టివెయ్యాలని అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాడు ఆమెకు దూరంగా ఉండాలనుకున్నాడు ఈ పది సంవత్సరాలనుండి ఆమె జీవితంతో అతడి ఆలోచనలూ అలవాట్లూ పెనవేసుకు పోయాయి వాటినన్నిటినీ ఛేదించివేయాలి పది సంవత్సరాల జీవితాన్ని ఒక సుస్వప్న మనుకోవాలి. ఇదంతా మర్చి పోవటానికి దూరంగా పోవాలి ఆమెమాట, ఆమెగాలి—ఆమెను గురించిన భావన ఏదీ తన దరికి రాకూడదు

రైలు పెట్టెలో కూర్చుని చదవటానికి పత్రిక విప్పేడు శాంత భద్రంగా దాచుకుని కళ్ళ కద్దుకున్న ఉత్తరాల పెట్టె కంటిముందర ప్రత్యక్షమయింది పది సంవత్సరాల దాంపత్య జీవితం తరువాత తన పూర్వప్రణయ చిహ్నాలను భద్రంగా దాచుకుని చూసి మురిసిపోయే శాంతపట్ల కసి పెరుగుతోంది ఆమెకు దూరంగా ఉండాలని మనసు పరుగెత్తటం మొదలు పెట్టింది పరుగెత్తే మనసును ఉత్తరాల పెట్టె వెంబడిస్తోంది. విశ్వనాథం ముఖంలో కోపం అసహ్యం రోషం బుస్సున పైకి పొంగాయి.

తులశమ్మ యింట్లో అడుగు పెడుతుండగానే వెంకన్న ఎదురువచ్చి "అమ్మగారికి పురుడువచ్చి ఇవాళ్టికి నాలుగు'' అన్నాడు

''నాలుగు సామాన్లూ సర్దుకుని వద్దామనుకున్నా. ఇంతలోకే సుస్తీ చేసింది విశ్వం నిన్ను వదలిపెట్టి మదరాసు ఎందుకు వెళ్ళినట్టు ?'' తులశమ్మ కొడుకును కసురుకుంటూ పురిటి గదిలో అడుగు పెట్టింది

శాంత కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తులశమ్మ చూడకుండా ముఖం తిప్పు కుంది.

విశ్వనాధం కోర్టు తెరిచిన నాడే ప్రొద్దటిపూట రైలులో దిగాడు. అతడు గడపలో కాలు పెట్టగానే తులశమ్మ చివాట్లుపెట్టింది. నిర్లిప్తతగా నవ్వి లోపలికి వెళ్లాడు.

తులశమ్మ పాపాయికి పేరు పెట్టించాలని ఎంతో ఆశపడ్డది.

"నీ కిష్టమయిన పేరుతో పిలుస్తూ ఉండు." విశ్వనాథం అన్నమాటలో తులశమ్మ కెంతో వైరాగ్యము నిర్లిప్తత గోచరించాయి. పోయిన బిడ్డలను జ్ఞప్తికి తెచ్చుకుని ఆమె మరిమాట్లాడలేదు.

విశ్వనాథం ఇంట్లో మామూలుగా ఏమీ జరగనట్లే మామూలుగా తన పని చూసుకుంటూ కోర్టుకు వెళ్ళుతున్నాడు అతడి మనసులో పీఠం వేసుకునికూర్చున్న అనుమానం ఇంటికి రాగానే తలఎత్తి బుస్సు మంటున్నది. అతడి అరికాళ్ళ క్రింద నిప్పులు పోస్తున్నది. అతడు లాపుస్తకాల నన్నిటినీ ప్రక్కకు పెట్టి ఇతర గ్రంథాలను తిరగవెయ్యటం మొదలుపెట్టాడు.

శాంతకు అతడి విదిలింపులూ ముభావమూ దూరదూరంగా తిరగటమూ మరొక విధంగా అర్థమవుతున్నాయి. ముగ్గురు బిడ్డలు పోయిన విచారంతో ఈబిడ్డ మీద మమతలు పెంచుకోదలచలేదనుకుంది. కాని తనుమాత్రం పసి బిడ్డ పనులలో మునిగిపోయి క్రొత్త ప్రపంచాన్ని సృష్టించుకున్నది

ఉదయం ఎనిమిది గంటలవేళ. విశ్వనాథం కట్టించిన కొత్త యింటిచుట్టూ పూలచెట్లు రంగురంగుల పూవులు విచ్చి ఆయింటి అందాన్ని ఇనుమడింపచేస్తున్నాయి. వాటి ముందు ఎర్ర మొక్కల బార్డరు మరింత అందాన్నిస్తున్నది. పారిజాతాలు భూమి కనబటకుండా రాలాయి. పెరటి వైపు మందారాలూ మల్లెలూ విచ్చుకుని చిరుగాలికి తలలూపుతూ రండి రండి అని అందరినీ పిలుస్తున్నాయి. చెట్టు చెట్టునూ ముట్టుకుని చూసి క్షేమ మడిగి ముందుకు పోతున్నాడు విశ్వనాథం. బోగన్ విలా అన్ని రంగులలో ఇంటిప్రహరి గోడపైకెక్కి ముట్టుకున్నవాళ్ళను ముళ్ళతో గుచ్చుతున్నది నాలుగు ప్రక్కలా కలియజూసి విశ్వనాథం వెనక్కి తిరిగాడు. సాంబశివరావు నవ్వుతూ నిలబడ్డాడు ఎదురుగా.

"హఠాత్తుగా ఇలా వూడి పడ్డావేం? ఉత్తరమ్ముక్క వ్రాస్తే స్టేషనుకువచ్చే వాడినిగా!" చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళాడు.

కాఫీ ఉప్మా తీసుకుంటూ "ఒరేయ్! నీచేత్తో నీవొక కార్డుముక్క వ్రాయలేక పోయావునీ యింట్లో లక్ష్మి పుట్టిందంటూ, పైగా ఇంటికి వచ్చిన వాడిని పట్టుకుని ఉత్తరం వ్రాసి రాలేదంటున్నావు ఏమిట్రా నీ జబర్దస్తీ?"

"నిజం నిజం అలా అడుగు నాయనా వాడిని" అంటూ తులశమ్మ ఉప్మా మారు వడ్డించింది

తల వూపుతూ లేచి వచ్చి సాంబశివరావు భుజం తట్టాడు విశ్వనాథం.

ఖాళీ కప్పు క్రింద పెడుతూ "మా ఆవిడ తన ప్రియస్నేహితురాలి బిడ్డను చూసిరండని పోరుపెడితే పడలేక వచ్చాననుకో!"

"చెప్పావు అసలు సంగతి! నీవు పెళ్ళయిన తరువాత మరి నాకు కనబడ్డావా చెప్పు? నీవు ఎక్కడుంటున్నదీ ఏం చేస్తున్నదీ ఒక్కమాటయినా నాకు వ్రాశావా చెప్పు?"

"ఇప్పుడు చెప్ప కుంటానా? పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఉద్యోగం వెలగ బెడుతున్నా అదీ పురుష లక్షణం కోసమే."

తులశమ్మ బిడ్డను తీసుకువచ్చి సాంబశివరావు చేతి కిచ్చింది. అతడు ఆబిడ్డ ముఖంలో కనబడుతున్న పోలికలను వర్ణిస్తున్నాడు

ఏడుస్తున్న బిడ్డను తీసుకుపోవటానికి వచ్చిన శాంత సాంబశివరావును చూసి నివ్వెర పోయింది తడబడుతున్న కాళ్ళతో బిడ్డను లోపలికి తీసుకువెళ్ళింది అతడిని చూసినప్పటినుండీ ఆమెకు కాళ్ళూ చేతులూ వణకటం మొదలు పెట్టాయి. బిడ్డ ప్రక్కనే ఒరిగి నీరసంగా కళ్ళు మూసుకుంది గతచరిత్ర ఫిల్మురీలులా గిరగిర తిరుగుతున్నది ఆమె మనసులో దాని నుండి తప్పించుకోవటమెట్లా? తలఎత్తి ఒక్క సారి విదిలించి మళ్ళీ దిండుమీదికి వాల్చింది

పదకొండేళ్ళ పిల్ల పుట్టక పూర్వమే తండ్రిని పోగొట్టుకున్నది ఏడవ ఏట తల్లి చనిపోతూ మేనమామ చేతిలో పెట్టింది. మామయ్య లేనప్పుడు అత్తయ్య

ఇంటెడుచాకిరీ చేయిస్తూ నెత్తిమీద మొట్టుతూ ఉండేది. సాయంత్రము వేళల్లో మామయ్య ఆ పిల్లను ఒంటరిగా దగ్గరికి తీసుకుని వోదారుస్తూ కన్నీళ్ళు తుడుస్తూ ఉండేవాడు. ఆ మాటల్లో ప్రొద్దటినుండీ పడ్డ బాధలన్నీ మర్చిపోగలిగేది. ఒకనాడు అత్తయ్య పొరుగింటికి వెళ్ళుతూ కాఫీ డికాక్షన్ వెయ్యమని చెప్పింది. కుంపటి మీద ఉన్న గిన్నెను గుడ్డతో పట్టుకుని ఫిల్టరులో పోస్తున్న పిల్లకు చేతికి ఆవిరి కొట్టింది. ఆమె చేతిలో ఉన్న గిన్నెజారి ఫిల్టరుమీద పడటము, ఇది దొర్లిపోవ టమూ అనుకోకుండా ఒక్క క్షణంలో జరిగిపోయాయి. మళ్ళి నీళ్ళుపెట్టటానికి కాఫీపోడిలేదు. భయంతో గజగజ వణకుతూ కుంపటికి ఎదురుగా కూర్చుంది తల వంచుకుని. మూడుగంటల వేళకు అత్తయ్య వచ్చింది కాఫీ కలపమంటూ అరగంట యినా కదలకపోతే జుట్టు పట్టుకుని హాల్లోకి లాక్కొచ్చి ఈ చెంప ఆ చెంపా వాయించింది.

ఆపిల్లకానాడు ఆ దెబ్బలకు ఏడుపురాలేదు. ముఖం కందగడ్డలా అయింది. తల వంచుకొని గోడవారగా నిలబడి ఒక నిశ్చయానికి వచ్చింది. తనకెవరు లేరు ఉన్న మామయ్య వోదార్చటమే కాని తననేమీ కష్టాలనుంచి రక్షించలేడు. అత్త య్య లోపలికి వెళ్ళినప్పుడు పెరటి తలుపుతెరుచుకొని అలసిపోయేవరకూ పరుగె త్తింది. ఆ పరుగుచూసి పోలీసులుపట్టుకున్నారు. కోర్టులో విచారణ జరిగింది. తన కెవరూ లేరన్నది. ఏ తప్పుపని చెయ్యలేదన్నది. అయినా వాళ్ళు తీసుకునిపోయి బాలనేరస్థుల పాఠశాలలో చేర్పించారు.

ఆడుకోవటానికి, సహవాసము చెయ్యటానికీ పాఠశాలలో అరవై మంది వున్నారు. మెట్రిక్‌వరకూ చదువుకోవచ్చు. కాని ఆ పిల్లలంతా దొంగతనం చేసి ఈ పాఠశాలకు వచ్చారు. టీచర్లు వాళ్ళను నీచంగా చూస్తున్నారు. ఆ పిల్లల పాఠ శాలలో కూడా బట్టలూ, రిబ్బన్లూ, తలపిన్నులూ పువ్వులూ ఒకరిని ఒకరు దొంగి లించుకుని నీచాతినీచంగా తిట్టుకుని కొట్టుకుంటారు. ఈ పదకొండేళ్ళ పిల్ల ఎవరి తోను ఆడుకోదు. ఎవరితోనూ మాట్లాడదు. తనలోతాను ఏవో పాటలు పాడు కుంటూ ఉంటుంది. ముంగి అంటూ. తోటిపిల్లలు పిలిచినా తలఎత్తదు. ఆమె మెట్రిక్ ప్యాసయ్యేవరకూ పద్దెనిమిది సంవత్సరాలు వచ్చాయి.

ఆ పాఠశాల సలహాసంఘ సభ్యురాలు లక్ష్మీదేవమ్మను ఆపిల్ల ఆకర్షించింది. ఆమెకు చనిపోయిన తన రెండవ కుమార్తె శాంత ఆ పిల్లలో కనిపించింది. ఆ పిల్ల

సంరక్షణభారం తాను వహిస్తానని చెప్పి తీసుకువచ్చి తన పిల్లలతోపాటు మదరాసు
పంపి క్వీన్ మేరీస్ కాలేజీలో చేర్పించి హాస్టల్లో ఉంచింది ఆపిల్లను శాంత అని
పిలుస్తూ మనసును శాంతింప చేసుకుంటున్నది

శైశవంలో మేనత్త మేనమామలవద్ద, కౌమారంలో బాలనేరస్థుల పాఠశా
లలో పెరిగిన శాంతలో ముఖమాటం మూటకట్టినట్టుగా ఉంటుంది చూపులో
బెరుకుతనం మనసులో జంకు బాగా పాతుకుపోయాయి ఎప్పుడూ ఏదో ఆలో
చిస్తూ ఉంటుంది ఉత్సాహాన్ని సంతోషాన్ని పైకి పొంగనీయదు

లక్ష్మీదేవమ్మ పెద్దకూతురు ప్రభావతి అందరితోనూ కలుపుగోలుగా
మాట్లాడుతూ వుండేది. ఆమె తాను ఉత్సాహంగా ఉల్లాసంగా వుంటుంది ఎదుటి
వారిలో కూడా వాటిని ఉద్భవింపచేస్తుంది శాంత తలఎత్తి నలుగురితోనూ మాట్లాడే
ట్టు ఆమె చేసింది జమీందార్ కుటుంబంలో మంచి సంబంధం చూసి ప్రభావతికి
వివాహం చేశారు ఆమె వెళ్లినప్పటినుండీ శాంత మళ్లీ ఒంటరిదయింది | ప్రభా
వతి అత్తవారింటినుంచి శాంతతో బెరుకుతనం, నిరుత్సాహము, మందకొడితనం
పోగొట్టాలని ఉత్తరాలు వ్రాస్తూ వుండేది. ముఖ్యంగా వాటిలో ఒక ఉత్తరం జీవం
లేని శాంతకు జీవం పోసింది. ఆ ఉత్తరం ఎప్పుడు చదువుకున్నా శాంతలో నూత
నోత్సాహము కలుగుతుంది. హృదయం ఆనందంతోనిండి, పొంగులువారి ఒడ్డు
లొరుసుకుంటూ ఉరవడితో ప్రవహించే జీవనదిలా ఉంటుంది

మరుసటి సంవత్సరం శాంత బి ఎ ప్యాసు కాగానే లక్ష్మీదేవమ్మ తన
భర్తకు జూనియరుగా ఉన్న విశ్వనాథానికి ఇచ్చి వివాహం చేసింది.

అత్తవారింటికి వెళ్లేనాడు శాంత ఆమె కాళ్లకు నమస్కరిస్తూ "అనాథగా
వీధిలో తిరిగే చింపిరి బట్టల పిల్లను తీసుకువచ్చి కడుపులో పెట్టుకొని పెంచారు.
పెళ్లి చేశారు. నేను మీ ఋణం ఎలా తీర్చుకోను?" కన్నీళ్లు రాల్చింది

శాంత కన్నీళ్లు ఒత్తుతూ "నీవు మా శాంతవు" అంటూ గుండెకు హత్తు
కుంది లక్ష్మీదేవమ్మ.

శాంత అలా గాలివాటుగావచ్చి సంపన్నుడయిన విశ్వనాథం యింట్లో
పడ్డది. విశ్వనాథం ఆమె సౌందర్యాన్నీ విజ్ఞానాన్నీ అన్నిటినీ మించి ఆమెలో

పాతుకుపోయిన వినమ్రతనూ రెప్పవాల్చకుండా తనివితీరా చూస్తాడు. శాంత తనకు ప్రభావతి వ్రాసిన ఉత్తరాలను తలుచుకుంటూ పులకలుదేరుతూ వుంటుంది. లక్ష్మీ దేవమ్మ అవుదార్యాన్ని దేనితో కొనాలా అని ఆలోచిస్తూ వుంటుంది.

పొద్దుపోయి భోజనం చేసిన విశ్వనాధం సాంబశివరావులు కాఫీ తాగేవరకూ శాంత నిద్రపోయింది. ఆ పగటినిద్రలో పీడకల. సాంబశివరావు పెద్ద దయ్యంలా కనబడుతున్నాడు. బాలనేరస్థుల పాఠశాల నుంచి వచ్చిన దొంగపిల్ల అని వేలెత్తి తనను పదిమందిలో చూపుతున్నాడు. విశ్వనాధానికి ఆమెమీద జుగుప్స కలిగిస్తున్నాడు. శాంత కెవ్వున కేకవేసింది.

"నిద్రలో జడుసుకున్నావా శాంతా?" తులశమ్మ పరుగు పరుగున భోజనాల యింట్లోనుంచి వచ్చింది. మంచంమీదినుంచి క్రింద పడిన శాంతను లేవనెత్తింది. తాగుతున్న కాఫీ వదలిపెట్టి సాంబశివరావు వచ్చాడు. విశ్వనాథం అతడి వెనకాలే వచ్చాడు.

అందరినీచూపి శాంత సిగ్గుపడ్డది. నిద్రలో వెనక్కు జరిగానంది, తలవంచుకుంటూ.

ఆ రాత్రి మిత్రు లిద్దరూ వరండాలో మంచాలు వేయించుకుని చిన్ననాటి కబుర్లు చెప్పుకుంటున్నారు.

"నేను యింటికి వెళ్లగానే ఇక్కడికి మా ప్రభ ప్రయాణం. వాళ్లిద్దరూ ఒకరి నొకరు చూచుకుని చాలాకాలమయింది."

విశ్వనాధం దేహమంతా ముళ్లు ముళ్లుగా తేలింది. పడుకున్న వాడల్లా లేచి కూర్చున్నాడు. సాంబశివరావుతో అప్పటినుంచీ ఉత్సాహంతో మాట్లాడుతున్న విశ్వనాధంలో ఆ ఉత్సాహమంతా మాయమయి పోయింది. కనుబొమలు ముడిపడ్డాయి. అణగిఉన్న రోషము, కోపం, కసిబుస్సున పైకి పొంగాయి.

"నీవు అన్నీ తెలిసిన పెద్దమనిషి వనుకున్నాను. నీచ సంబంధాలను ప్రోత్సహించే అప్రాచ్యుడ వనుకోలేదు." మంచంమీద నుండి ఉద్రేకంతో లేచాడు విశ్వనాధం.

రెండు చేతులూ అడ్డంపెట్టుకుంటూ లేచాడు సాంబశివరావు.

ఉద్రేకంతో లేచిన విశ్వనాధం తన గదిలోకి వెళ్లి తలమీద రెండు చేతులూ పెట్టుకొని కళ్లు మూసుకున్నాడు. ఇంటికి వచ్చిన అతిథి తనకి సహాధ్యాయి. ప్రాణస్నేహితుడు. చిరకాలానికి కలుసుకున్నారు కాని తన ఉద్రేకాన్ని అదుపులో పెట్టుకోలేక పోతున్నాడు. సిగ్గుతో కుంచించుకుపోయి జుట్టు పీక్కున్నాడు విశ్వనాధం

సాంబశివరావు మెల్లగా లేచి గదిలోకి వెళ్లి విశ్వనాధం భుజమ్మీద చెయ్యి వేశాడు

"విశ్వం! ఉద్రేకంలో నీ వేమన్నావో నాకేమీ అర్థం కాలేదు. శాంతను చూడటానికి మా ప్రభ వస్తానంటే పంపుదామనుకున్నాను. నీ కిష్టం లేకపోతే మానేస్తుంది ఏమయినా నేను మాత్రం ఈ పన్నెండు గంటల రైలులో వెళ్ళి తీరాలి, టిక్కెట్టుకూడా వచ్చిననాడే కొని రిజర్వు చేసుకున్నాను. నా మాటలవల్ల నీకేమయినా కష్టం కలిగితే క్షమించు వస్తా" వెనక్కు తిరిగాడు.

చడీ చప్పుడూ లేకుండా వాళ్ళిద్దరి మధ్య వచ్చి నిలబడ్డది శాంత "ప్రభ నాకు దైవ సమానురాలు మీరు వెళ్ళి పంపటం కాదు. ఇక్కడవుండే టెలిగ్రాము యివ్వండి వెంటనే బయలుదేరమని. స్వయంగా వచ్చి పాపను దీవించమనండి" సాంబశివరావు కదలకుండా శాంత ద్వారబంధానికి అడ్డముగా నిలబడ్డది

"అవునురా సాంబూ! నాకూ ఆ దేవతాదర్శనం యిప్పించరా నాఅపోహలన్నీ తొలగి పోయాయి. నన్ను క్షమించు సాంబూ. ఇందాకటి నా మాటలకు కోసము తెచ్చుకోలేదు కదూ. నా స్వభావం నీవు ఎరుగనిదిట్రా" సాంబశివరావు చేతులు పట్టుకుని గుండె కానించుకున్నాడు.

పిల్ల ఏడుపు విని శాంత వాళ్ళిద్దరి మధ్యనుండి దూరి లోపలికి వెళ్ళింది తృప్తిగా

సు డి గా లి కి కళ్ళలో దుమ్ము పడ్డది కాని త్వరలోనే కళ్ళు తెరిపిడికి వచ్చాయి. ఏదీ సుడిగాలి? ఎటునుంచి వచ్చింది. ఎటు వెళ్ళింది? ఎప్పుడు మాయమయింది? అర్థంకాక సాంబశివరావు విశ్వం ముఖంలోకి చూశాడు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక)